# బాధిత యువతికి జగ్గారెడ్డి అభయం!

- చికిత్స కోసం రూ. 5 లక్షల ఆర్థిక సాయం
- “నాకు బతకాలని ఉంది..“ అంటూ వేడుకున్న బాధితురాలు
- ధైర్యం చెప్పిన సంగారెడ్డి నేత

**సంగారెడ్డి, ఏప్రిల్ 06 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా రాజకీయ నాయకుడు జగ్గారెడ్డి నిర్వహించిన దర్బార్‌లో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన ఓ యువతి తన ప్రాణాలను కాపాడాలని వేడుకుంటూ తల్లిదండ్రులతో కలిసి జగ్గారెడ్డిని ఆశ్రయించింది. “నాకు బతకాలని ఉంది.. నన్ను కాపాడండి అన్నా“ అంటూ సదరు యువతి కన్నీళ్లు పెట్టుకుంది. తాను తీవ్రమైన వ్యాధితో బాధపడుతున్నానని, చికిత్స కోసం ఇప్పటికే రూ. 5 లక్షలు ఖర్చు చేశామని వివరించింది. వ్యాధి పూర్తిగా నయం కావడానికి మరో రూ. 5 లక్షలు అవసరమని, అంత స్తోమత తమ వద్ద లేదని మొరపెట్టుకుంది. డాక్టర్లు నయం అవుతుందని చెబుతున్నారని, ఆర్థిక సాయం అందించి ప్రాణాలు నిలపాలని కోరింది.





### నేనే ఆదుకుంటా.. భరోసా ఇచ్చిన జగ్గారెడ్డి

యువతి ఆవేదనను విన్న జగ్గారెడ్డి వెంటనే స్పందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. “అధైర్యపడొద్దు.. నీకు నేనున్నాను“ అంటూ భరోసా ఇచ్చారు. మిగిలిన చికిత్సకు అవసరమైన రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని తానే స్వయంగా అందిస్తానని హామీ ఇచ్చారు.

ప్రతి శనివారం తన నివాసంలో నిర్వహించే దర్బార్ కార్యక్రమంలో జగ్గారెడ్డి ప్రజల సమస్యలను విని పరిష్కరిస్తున్నారు. సాయం అందుతుందని హామీ లభించడంతో బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ జగ్గారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.





# ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు!

- రెపరెపలాడిన పార్టీ జెండా
- రైతు సంక్షేమమే మోదీ లక్ష్యం: మైపాల్ రెడ్డి

**బెజ్జంకి, ఏప్రిల్ 06 (జనం పవర్):** బెజ్జంకి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే దేవక్కపల్లి గ్రామంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మైపాల్ రెడ్డి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ సుస్థిర పాలన అందిస్తున్నారని కొనియాడారు. రైతుల శ్రేయస్సు కోసం కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బుర్ర మల్లేశం గౌడ్, మండల నాయకులు దొమ్మాటి రాములు, కొత్తపేట రామచంద్రం, సంఘ రవి, నర్సింగం, వడ్లూరి సాయిలు, వడ్లూరి శ్రీనివాస్, శీలం వెంకటేశం, ధోనే అంజయ్య, బండి పెల్లి శ్రీనివాస్, మహేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవ్యవస్థ బలోపేతమే లక్ష్యం!

### న్యాయమూర్తులతో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం భేటీ

### న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని వెల్లడి



**సంగారెడ్డి, ఏప్రిల్ 07 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా న్యాయమూర్తి, ప్రథమ అదనపు జిల్లా న్యాయమూర్తి, పోక్సో కోర్టు న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది. తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ న్యాయవాదుల సంక్షేమం, వృత్తి అభివృద్ధి, న్యాయ సేవల నాణ్యతను మెరుగుపర్చేందుకు కృషి చేస్తామని నూతన సభ్యులు న్యాయమూర్తులకు వివరించారు. న్యాయవాదులు, న్యాయవ్యవస్థ మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం తమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.

### నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి. సంజీవ్ రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా వి. మంజుల రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దారిపల్లి అశోక్ బాధ్యతలు చేపట్టారు. సంయుక్త కార్యదర్శిగా పి. సురేందర్, క్రీడా కార్యదర్శిగా శ్రీనివాస్ గౌడ్, లైబ్రరీ కార్యదర్శిగా నందు పటేల్, ఖజాంచీగా ఎల్. ఆర్. పద్మజ వ్యవహరిస్తారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు సి. విట్టల్ రెడ్డి, అంబాదాస్, నర్సిములు, సందీప్, అరుణ కుమారి, సుజాత, ప్రభాకర్ పాల్గొన్నారు. న్యాయమూర్తులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ.. భవిష్యత్తులో న్యాయవాదుల అభివృద్ధి, ప్రజలకు అందించే న్యాయ సేవల విస్తరణలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశం పరస్పర సహకారం, న్యాయవ్యవస్థ పురోగతికి దోహదపడే దిశగా ఒక సానుకూల అడుగుగా నిలిచింది.



# పల్లె పల్లెనా రెపరెపలాడిన కాషాయ జెండా!

### 47వ వసంతంలోకి అడుగుపెట్టిన భారతీయ జనతా పార్టీ

### కోహెడ మండల వ్యాప్తంగా ఘనంగా ఆవిర్భావ వేడుకలు

### ముందుకు రావాలని యువతకు, మేధావులకు పిలుపు

**కోహెడ, ఏప్రిల్ 06 (జనం పవర్):** భారతీయ జనతా పార్టీ 46 వసంతాలు పూర్తి చేసుకుని 47వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా కోహెడ మండల వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతి కార్యకర్త తమ ఇంటిపై జెండాను ఆవిష్కరించి జెండా పండుగ జరుపుకున్నారు. బస్వాపురం గ్రామ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షులు పుల్లూరు నవీన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి చిరునామా, సేవకు పర్యాయపదం బీజేపీ జెండా అని కొనియాడారు. పార్టీ జెండా మనందరికీ గౌరవమని పేర్కొన్నారు.

### తిరుగులేని శక్తిగా బీజేపీ

కోహెడ మండల కేంద్రంలోని సంఘ భవనంలో మండల పార్టీ అధ్యక్షులు జాలిగం రమేష్ పార్టీ జెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రతి పల్లెలో అంచలంచెలుగా విస్తరిస్తూ తిరుగులేని శక్తిగా అవతరిస్తోందని అన్నారు. పార్టీలోకి మేధావులు, విద్యావంతులు, యువకులు, అనుభవజ్ఞులు పెద్ద సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. రేపటి తరానికి బీజేపీ శ్రీరామరక్షగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు తుపాకుల రవి, భాస్కర్, భానోత్ సురేష్, గిరిధర్, సురేష్, వెంకటేష్, శంకర్ గౌడ్, శ్రీనివాస్, అనిల్, బాపురాజు, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ!

### బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్ గొడిసెల సంధ్యారాణి

### సమన్వయంతో ముందుకెళ్తామన్న వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా గొడిసెల సంధ్యారాణి, వైస్ చైర్‌పర్సన్‌గా మిట్టపల్లి సరిత సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ సర్వతోముఖాభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా తోటి కౌన్సిలర్ల సలహాలు తీసుకుంటూ, అందరి సమన్వయంతో క్యాతనపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరితతో పాటు కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది చైర్‌పర్సన్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# గర్భిణీలకు పౌష్టికాహార భరోసా!

### అంగన్వాడీ కేంద్రంలో ఆహార పదార్థాల పంపిణీ




**బెజ్జంకి, ఏప్రిల్ 06 (జనం పవర్):** బెజ్జంకి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారము, బాలామృతం, గుడ్లను సర్పంచ్ బొల్లం శ్రీధర్ సోమవారం అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పోషకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొల్లం శ్రీధర్ మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. దీనివల్ల తల్లితో పాటు శిశువు కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పిల్లల ఎదుగుదలకు, సరైన బరువు, ఎత్తు పెరగడానికి ఈ ఆహారం ఎంతో దోహదపడుతుందని వివరించారు. నిరంతరం పిల్లల బరువు, ఎత్తును పరీక్షించుకుంటూ ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కనక లక్ష్మి, బాలింతలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.


# వీరాపూర్‌లో విషాదం..

### బావిలో దూకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

### ఉద్యోగం లేక రెండు నెలలుగా మానసిక వేదన

### గతంలో లండన్‌లో పనిచేసిన భాగ్యరెడ్డి





**బెజ్జంకి, ఏప్రిల్ 06 (జనం పవర్):** మండలంలోని వీరాపూర్ గ్రామంలో విషాదం నెలకొంది. నిరుద్యోగంతో బాధపడుతూ ఓ యువకుడు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బెజ్జంకి ఎస్ఐ బోయిని సౌజన్య తెలిపిన వివరాల ప్రకారం.. వీరాపూర్ గ్రామానికి చెందిన మారు భాగ్యరెడ్డి (34) గతంలో లండన్‌లో ఉద్యోగం చేశారు. కరోనా సమయంలో స్వదేశానికి తిరిగి వచ్చారు. గత కొంతకాలంగా బెంగళూరు, పూణేలోని ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేశారు. గత రెండు నెలలుగా ఉద్యోగం లేకపోవడంతో నిరుద్యోగంతో మానసిక వేదనకు గురై ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆదివారం తన తండ్రి సుధాకర్ రెడ్డితో కలిసి పొలం వద్దకు వెళ్లిన భాగ్యరెడ్డి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం సమీపంలోని వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి పంపించారు. మృతుడి తండ్రి సుధాకర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సౌజన్య వెల్లడించారు.



# ఆదిలాబాద్ అభివృద్ధికి రూ. 1,238 కోట్లు..

- బాసర క్షేత్రానికి రూ. 225 కోట్లు.. త్వరలో ప్రత్యేక యూనివర్సిటీ
- పిప్రి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

**తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముఖచిత్రాన్ని మార్చేలా రూ. 1,238 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం పిప్రి వేదికగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఖనిజ సంపద ఉన్న ఆదిలాబాద్ గూడెంలో ఇంకా పేదరికం తాండవిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వెనుకబాటును చెరిపేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.

## బాసరకు పూర్వవైభవం

దక్షిణ భారతాన ఏకైక అక్షర జ్ఞాన క్షేత్రమైన బాసర సరస్వతి దేవాలయాన్ని దేశంలోనే గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని సీఎం ప్రకటించారు. ఆలయ విస్తరణ, భక్తుల వసతుల కోసం తొలి విడతగా రూ. 225 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే మరిన్ని నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## ఆదిలాబాద్‌కు యూనివర్సిటీ

జిల్లా ప్రజల సుదీర్ఘ కాలపు నిరీక్షణకు సీఎం తెరదించారు. త్వరలోనే భూసేకరణ పూర్తి చేసి ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక యూనివర్సిటీ పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కులమతాల భేదం లేకుండా అందరూ కలిసి చదువుకునేలా 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' నిర్మిస్తామన్నారు. విద్యార్థుల కోసం అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను మరింత పటిష్టం చేస్తున్నట్లు వెల్లడించారు.

## పాదయాత్ర స్ఫూర్తి.. ప్రజాపాలన

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గతంలో చేపట్టిన పాదయాత్రే ఈ అభివృద్ధి ప్రణాళికలకు పునాది అని నేతలు పేర్కొన్నారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్రి నుంచి తాను నడిచిన ప్రతి అడుగులో ప్రజల కష్టాలను చూశానని, నాడు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ఈ సభ ఉద్దేశమని భావోద్వేగంగా చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేయని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కొన్ని నెలల్లోనే పట్టాలెక్కించిందని విమర్శించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అంటే నిబద్ధత గల పార్టీ అని, రాబోయే ఎన్నికల్లో 100 సీట్లు సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పార్టీ శ్రేణులు, జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లక్షెట్టిపేట కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా ముజఫర్ అలీ ఖాన్!

**సామాన్య కార్యకర్త నుంచి కీలక నేతగా ఎదిగిన తీరు**

**జన్నారం నుంచి లక్షెట్టిపేట దాకా అప్రతిహత ప్రస్థానం**

**నమ్మకానికి పట్టం కట్టిన పార్టీ అధిష్ఠానం**

**తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**



రాజకీయాల్లో నిబద్ధతకు, కష్టపడే తత్వానికి గుర్తింపు ఎప్పుడూ ఉంటుంది. అందుకు నిదర్శనమే జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన ముజఫర్ అలీ ఖాన్ రాజకీయ ప్రస్థానం. సాదాసీదా కార్యకర్తగా ప్రస్థానాన్ని మొదలుపెట్టి, నేడు జిల్లా రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదిగిన ఆయనకు పార్టీ అధిష్ఠానం తాజాగా లక్షెట్టిపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించింది. ముజఫర్ అలీ ఖాన్ ప్రయాణం ఒక స్ఫూర్తిదాయకమైన పాఠం. జన్నారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో గల్లీ గల్లీలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఆయన పనితీరును మెచ్చిన పార్టీ గతంలోనే జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి కల్పించింది. తాజాగా జిల్లా బాధ్యతలతో పాటు లక్షెట్టిపేట మండల బాధ్యతలను కూడా ఆయన భుజస్కంధాలపై ఉంచడం గమనార్హం.

## లక్షెట్టిపేటపై ప్రత్యేక దృష్టి

తనకు దక్కిన కొత్త బాధ్యతలపై ముజఫర్ అలీ ఖాన్ స్పందిస్తూ పార్టీ పట్ల తనకున్న విధేయతను చాటుకున్నారు. "పార్టీ నాపై ఉంచిన నమ్మకం నా బాధ్యతను మరింత పెంచింది. లక్షెట్టిపేట మండలంలో కాంగ్రెస్ పార్టీని ఒక ఉక్కు కోటలా తయారు చేస్తాం. నాయకులు, కార్యకర్తలు అందరినీ కలుపుకొని ఒకే తాటిపై నడిపిస్తూ ప్రజా సమస్యలపై పోరాడటమే నా ప్రథమ ప్రాధాన్యత" అని ఆయన పేర్కొన్నారు. ముజఫర్ అలీ ఖాన్‌కు ఈ బాధ్యతలు దక్కడంపై జన్నారం, లక్షెట్టిపేట మండలాల్లో పండుగ వాతావరణం నెలకొంది. కవ్వాల్ గ్రామం నుంచి వెళ్లిన ఒక సామాన్య నేత నేడు నియోజకవర్గ స్థాయిలో చక్రం తిప్పుతుండటం పట్ల కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# బయో-వేస్ట్ వేలం వాయిదా!

**చికెన్, మటన్ వ్యర్థాల సేకరణకు ఏజెన్సీ ఎంపిక నిలిపివేత**

**అనివార్య కారణాలతో మున్సిపల్ అధికారుల నిర్ణయం**

**మున్సిపల్ కమిషనర్ ప్రకటన**



**సంగారెడ్డి, ఏప్రిల్ 06 (జనం పవర్):** సంగారెడ్డి పట్టణంలోని చికెన్, మటన్, చేపల దుకాణాల నుండి ఉత్పత్తి అయ్యే బయో-వేస్ట్ సేకరణకు గుర్తింపు పొందిన ఏజెన్సీ ఎంపిక కోసం నిర్వహించాల్సిన బహిరంగ వేలం వాయిదా పడింది. ఈ వేలం మంగళవారం ఉదయం 11:00 గంటలకు సంగారెడ్డి పురపాలక సంఘ కార్యాలయంలో జరగాల్సి ఉంది. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ వేలం వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి వేలం నిర్వహించే తేదీ, సమయాన్ని త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సంబంధిత ఏజెన్సీలు, నిర్వాహకులు గమనించాలని కోరారు.

# మత్తు మాఫియాపై ఉక్కుపాదం!

**మంచిర్యాల జిల్లాలో 'ఆపరేషన్ గంజాయి' ప్రారంభం**

**300 మందిపై సస్పెక్ట్ షీట్లు.. నిరంతర నిఘా**

**పద్ధతి మార్చుకోకుంటే పీడీ యాక్ట్ తప్పదు: డీసీపీ భాస్కర్**

**తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

జిల్లాలో డ్రగ్స్, గంజాయి మహమ్మారిని వేళ్లతో సహా పెకిలించేందుకు పోలీస్ యంత్రాంగం మెరుపు చర్యలు ప్రారంభించింది. యువత భవిష్యత్తును చిదిమేస్తున్న మత్తు మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని డీసీపీ భాస్కర్ స్పష్టం చేశారు. అక్రమ రవాణాదారులకు ఆయన గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ ఒక కీలక ప్రకటన విడుదల చేశారు.

## పోలీస్ శాఖ వ్యూహం ఇదే!

జిల్లాలోకి మత్తు పదార్థాలు అడుగుపెట్టకుండా ఉండేందుకు ప్రత్యేక నార్కోటిక్ బృందాలను రంగంలోకి దించారు. నిరంతర నిఘా ఉంచడం తో పాటు ఆకస్మిక దాడులు చేయడమే లక్ష్యంగా ఈ బృందాలు పనిచేస్తున్నాయి. గంజాయి నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న పాత నేరస్తులు, అనుమానిత కదలికలు ఉన్న సుమారు 300 మందిపై ఇప్పటికే పోలీసులు సస్పెక్ట్ షీట్లు తెరిచారు. వీరి ప్రతి కదలికను పోలీసులు నిశితంగా గమనిస్తున్నారు. తొలుత అవగాహన కల్పించినా, కౌన్సిలింగ్ ఇచ్చినా పద్ధతి మార్చుకోని మొండి విక్రేతలపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని డీసీపీ హెచ్చరించారు. మత్తు పదార్థాల విక్రయదారులకు జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు.



***"మంచిర్యాల జిల్లాను 'డ్రగ్స్ ఫ్రీ' జోన్‌గా మార్చడమే మా లక్ష్యం. గంజాయి అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 300 మందిని నిఘా నీడలోకి తెచ్చాం."***

***-భాస్కర్, డీసీపీ, మంచిర్యాల.***

మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల పట్ల తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని డీసీపీ సూచించారు. తమ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# పరీక్షల భయం వీడాలి!

- ఆత్మవిశ్వాసమే లక్ష్య సాధనకు మార్గం
- సెల్ ఫోన్లు, సినిమాలకు దూరంగా ఉండాలి
- లక్షెట్టిపేట గురుకులంలో అవగాహన సదస్సు

**వేల్పుల నగేష్ జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో:**

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినులు పరీక్షల పట్ల భయాన్ని వీడి ధైర్యంగా ముందుకు సాగాలని మోటివేషనల్ స్పీకర్ సుందిళ్ల రమేష్ పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ కోటూరి రామ కళ్యాణి అధ్యక్షతన ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, లక్ష్య సాధనపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

## క్రమశిక్షణతోనే విజయం

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామ కళ్యాణి మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల పట్ల ఎలాంటి అపోహలకు లోను కాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. చదువుపై నిజమైన ఆసక్తిని పెంపొందించుకోవాలని, ప్రణాళికాబద్ధంగా చదువుతూ సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. నిరంతర సాధనతో పాటు చెడు అలవాట్లు, సెల్ ఫోన్లు, సినిమాలకు దూరంగా ఉండాలని చెప్పారు. రోజుకు ఎనిమిది గంటల నిద్ర, శారీరక వ్యాయామం, మానసిక ప్రశాంతతతోనే జీవితంలో రాణించవచ్చని వివరించారు. ముందుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కే. మహేశ్వరరావు



విద్యార్థినులకు కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు. ఇటువంటి మోటివేషనల్ సెషన్స్ వల్ల విద్యార్థినులలో దాగి ఉన్న భయాలు తొలగిపోతాయని, వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గీతాంజలి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ శిరీష, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. హెచ్. శ్రీలత ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

# విద్యార్థినుల భద్రతకు 'షీ టీమ్' భరోసా!

- ఆత్మహత్య ఆలోచనలు వీడి ధైర్యంగా ఉండాలి
- టెన్షన్ వద్దు.. సమస్యలను పంచుకోండి
- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో:**

మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ పర్యవేక్షణలో చెన్నూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలలో షీ టీమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల చోటుచేసుకున్న విషాద ఘటనల నేపథ్యంలో విద్యార్థినుల్లో మనోధైర్యాన్ని నింపేందుకు చెన్నూరు ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్, షీ టీమ్ ఎస్ఐలు హైమ, ఉషారాణి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు.

## వైఫల్యం అంతిమం కాదు

పరీక్షల్లో తక్కువ మార్కులు రావడం లేదా ఏదైనా విషయంలో ఓడిపోవడం జీవితం ముగిసిపోవడం కాదని పోలీసులు వివరించారు. అది ఒక నేర్చుకునే ప్రక్రియ మాత్రమేనని, ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలని



సూచించారు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామాలు చేయాలని తెలిపారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే నమ్మకమైన స్నేహితులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని కోరారు.

## సామాజిక మాధ్యమాలతో జాగ్రత్త

సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అవసరమని పోలీసులు హెచ్చరించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి వేదికల్లో గుర్తుతెలియని వ్యక్తులతో స్నేహం చేయడం, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకోవడం వంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్ వేధింపులకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు లేదా సమీప సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

# మున్సిపల్ పీఠాలపై కొత్త సమీకరణాలు!

- క్యాతనపల్లిలో ఎర్రజెండా రెపరెపలు
- ఖానాపూర్‌లో బీజేపీ - బీఆర్ఎస్ దోస్తీ

**తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మున్సిపల్ రాజకీయం ఆదివారం నాటి పరిణామాలతో సరికొత్త మలుపులు తిరిగింది. కమ్యూనిస్టులు తమ ఉనికిని చాటుకోవడంతో పాటు ప్రధాన పార్టీల మధ్య విలక్షణ పొత్తులు బహిర్గతమయ్యాయి. మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్, సీపీఐ కూటమి విజయం సాధించి పీఠాన్ని దక్కించుకుంది. సింగరేణి గడ్డపై ఎర్రజెండా రెపరెపలాడటంతో ఆ పార్టీ కార్యకర్తలలో నూతనోత్సాహం కనిపిస్తోంది. జిల్లాలోని సుమారు యాభై వేల మందికి పైగా ఉన్న కమ్యూనిస్టు ఓటర్లకు ఈ గెలుపు ఒక ఊపిరి పోసింది. భవిష్యత్తులో లెఫ్ట్ పార్టీలు తమ పట్టు ఉన్న ప్రాంతాల్లో మళ్ళీ పుంజుకోవడానికి ఇది ఒక బలమైన పునాదిగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.




నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీలో చోటుచేసుకున్న పరిణామాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాయి. రాష్ట్ర స్థాయిలో ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ ఇక్కడ అధికారం కోసం చేతులు కలిపాయి. మున్సిపల్ చైర్మన్ పదవిని బీజేపీ కౌన్సిలర్ అంకం మౌనిక దక్కించుకోగా వైస్ చైర్మన్ పీఠం బీఆర్ఎస్ ఖాతాలోకి వెళ్ళింది. బీఆర్ఎస్ కౌన్సిలర్ మహమ్మద్ షోహెబ్ వైస్ చైర్మన్ గా ఎన్నికై రాజకీయ సమీకరణాలను ఒక్కసారిగా మార్చేశారు. స్థానిక అవసరాల దృష్ట్యా సిద్ధాంతాలను పక్కనబెట్టి ఈ రెండు పార్టీలు అధికారం పంచుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఈ రెండు మున్సిపాలిటీల ఫలితాలు జిల్లా రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీశాయి. క్యాతనపల్లి గెలుపు స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా కమ్యూనిస్టులు తమ కార్యకలాపాలను వేగవంతం చేసే అవకాశం కనిపిస్తోంది. పీఠాల వేటలో పార్టీలు తమ వైరాన్ని పక్కనపెట్టి అవగాహనతో ముందుకు సాగుతున్నాయని స్పష్టమవుతోంది. నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఆయా పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త పాలకవర్గాలు మున్సిపాలిటీల అభివృద్ధిలో ఏ మేరకు రాణిస్తాయో వేచి చూడాలి.

# కవ్వాల్ అడవిలో ఆగని అక్రమ దందా!





- అధికారుల అండతోనే కలప స్మగ్లింగ్.. ఇసుక రవాణా?
- జన్నారంలో యథేచ్ఛగా వన్యప్రాణుల వేట

**తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో అక్రమార్కుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. అటవీ సంపద దోపిడీతో పాటు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. క్షేత్రస్థాయిలో అక్రమాలకు సంబంధించిన ఆధారాలు కళ్ళముందే కనిపిస్తున్నా బాధ్యత గల అధికారులు మౌనం వహించడం వెనుక భారీ పర్సంటేజీల హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కులతో చేతులు కలిపిన కొందరు అధికారులే ఈ మాఫియాకు మార్గదర్శకులుగా మారి అటవీ సంపదను కొల్లగొడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఈ టైగర్ జోన్ పరిధిలో విలువైన టేకు కలప స్మగ్లింగ్ ముమ్మరంగా సాగుతోంది. దీనికి తోడు వన్యప్రాణుల వేట కూడా సాగుతుండటం పర్యావరణ ప్రేమికులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

గతంలో జనం పవర్ దినపత్రికలో ఈ అక్రమాలపై వార్తలు వచ్చినప్పుడు అధికారులు కేవలం రెండు రోజుల పాటు హడావుడి చేసి చేతులు దులుపుకున్నారు. మీడియా ఒత్తిడి ఉన్నప్పుడు మాత్రమే విధులు నిర్వహించినట్లు నటించి ఆ తర్వాత మళ్లీ యధావిధిగా అక్రమాలకు సహకరిస్తున్నారని జన్నారం వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరు చూస్తుంటే వార్త వస్తే రెండు రోజులు హడావుడి ఆ తర్వాత మళ్లీ మామూలే అన్నట్లుగా ఉందని విమర్శిస్తున్నారు. ఈ అక్రమ నెట్‌వర్క్‌ను ఛేదించాలంటే క్షేత్రస్థాయి అధికారుల వల్ల సాధ్యం కాదని జన్నారం ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జిల్లా స్థాయి నుంచి ఒక ప్రత్యేక అధికారిని నియమించి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమార్కులతో కుమ్మక్కైన అధికారులను తక్షణమే విధుల్లోంచి తొలగించాలని అడవి అంచున ఉన్న చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచాలని కోరుతున్నారు.

అనుమతులు లేని ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపాలని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జన్నారం మండలంలోని అడవులను ఇసుక వనరులను కాపాడాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేస్తున్నారు. మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయకుంటే కవ్వాల్ అడవి ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు పెంచడం ద్వారా మాత్రమే ఈ అక్రమ రవాణాను నియంత్రించడం సాధ్యమవుతుందని ప్రజలు సూచిస్తున్నారు. అటవీ సంరక్షణ కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# బిచ్కుంద డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా!

**9న ప్రముఖ కంపెనీల ఇంటర్వ్యూలు**

**నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం**



**జుక్కల్, ఏప్రిల్ 06 (జనం పవర్):** బిచ్కుందలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 9వ తేదీ గురువారం నాడు భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె. అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్లేస్మెంట్ సెల్, ఐక్యూఏసీ, టాస్క్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూలలో శ్రీ విజయ బయో ఫెర్టిలైజర్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని సేల్స్ ఎగ్జిక్యూటివ్, గ్రూప్ లీడర్, టీం మేనేజర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని ప్లేస్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ టి. అశోక్ రావు పేర్కొన్నారు. ఇంటర్ పాసైన వారు ఈ ఉద్యోగాలకు అర్హులని, డిగ్రీ పూర్తి చేసిన వారికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.

దీనితో పాటు ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ వారు కూడా డిగ్రీ పాసైన అభ్యర్థుల కోసం ఇంటర్న్‌షిప్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎంపికైన వారికి ఆరు నెలల శిక్షణ తర్వాత జూనియర్ ఎగ్జిక్యూటివ్ స్థాయికి పదోన్నతి కల్పిస్తారని చెప్పారు. జుక్కల్ నియోజకవర్గ ప్రాంతంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సందేహాల నివృత్తి కోసం 9908785716, 9701155512, 9704044029, 9492795524 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# అక్రెడిటేషన్ కార్డు దరఖాస్తులకు ఇంకా గడువుంది!

**జర్నలిస్టులు తొందరపడి తప్పులు చేయొద్దు**



**సంగారెడ్డి, ఏప్రిల్ 06 (జనం పవర్):** అక్రెడిటేషన్ కార్డు దరఖాస్తులకు సంబంధించి సోమవారం వరకే గడువు ఉందనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే ఫైసల్ తో పాటు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి స్పష్టం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ అలాగే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి అసిఫ్ లు ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇంకా జిల్లా స్థాయిలో అక్రెడిటేషన్ కమిటీలు ఏర్పాటు కాలేదని ఈ ప్రక్రియ పూర్తి కావడానికి సమయం పడుతుందని వారు తెలిపారు. కమిటీలు ఏర్పాటైన తర్వాత సమావేశాలు జరగడానికి మరో రెండు మూడు రోజుల సమయం తీసుకుంటుందని వివరించారు. రాష్ట్ర స్థాయిలో కూడా కమిటీ సమావేశమై కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అర్హులైన జర్నలిస్టు మిత్రులందరికీ కార్డులు వచ్చే విధంగా కొత్త మార్గదర్శకాలు రాబోతున్నాయని యూనియన్ నేతలు తెలిపారు. ఈ కారణంగా దరఖాస్తు చేసుకునే గడువు ఇంకా ఉందని జర్నలిస్టులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. అందరూ ఒకేసారి దరఖాస్తు చేస్తుండటంతో సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని తద్వారా తొందరపాటులో తప్పులు దొర్లే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. దరఖాస్తుల్లో పొరపాట్లు జరిగితే అవి తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉందని అందుకే నిమ్మళంగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దాదాపు రెండు సంవత్సరాల తర్వాత కొత్త కార్డులు వస్తున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డు అందాలన్నదే తమ యూనియన్ ఆకాంక్ష అని నేతలు స్పష్టం చేశారు. తప్పులు లేకుండా జాగ్రత్తగా దరఖాస్తులు నింపుకోవాలని సూచించారు. జిల్లా కమిటీలు ఏర్పడి మార్గదర్శకాలు వచ్చే వరకు సమయం ఉన్నందున ప్రతి ఒక్కరూ నిశ్చింతగా ఉండాలని కోరారు. కొత్తగా కార్డులు పొందే వారు నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. ఈ క్రమంలో ఎవరూ కూడా అనవసరపు వదంతులను నమ్మకూడదని జర్నలిస్టు సంఘం నాయకులు కోరారు.







# వివేకానంద పాఠశాలలో చిన్నారుల 'గ్రాడ్యుయేషన్ డే'!

- యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాల ప్రదానం
- పట్టభద్రుల వేషధారణలో అలరించిన చిన్నారులు

**తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల ఆవరణలో చిన్నారుల కోలాహలం నెలకొంది. యూకేజీ పూర్తి చేసుకుని ప్రాథమిక విద్యలోకి అడుగుపెడుతున్న విద్యార్థుల కోసం పాఠశాల యాజమాన్యం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే క్రమంలో వారికి చిన్నతనం నుండే చదువుపై ఆసక్తిని, ఉత్సాహాన్ని కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో యూకేజీ చదివిన చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వచ్చే విద్యాసంవత్సరం నుండి మొదటి తరగతిలోకి ప్రవేశించనున్న సందర్భంగా వారికి గ్రాడ్యుయేషన్ పట్టాలు ప్రదానం చేశారు. చిన్నారులందరికీ ప్రత్యేకమైన నలుపు రంగు గ్రాడ్యుయేషన్ దుస్తులు, టోపీలు ధరింపజేసి ఘనంగా సత్కరించారు. తమ చిన్నారులు పట్టభద్రుల్లా ముస్తాబై స్టేజీపై సర్టిఫికెట్లు అందుకుంటుంటే తల్లిదండ్రులు ఆనందంతో మురిసిపోయారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా చిన్నతనం నుండే ఉత్తమ నడవడికను అలవాటు చేస్తూ క్రమశిక్షణను నేర్పిస్తున్నామని చెప్పారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేలా శిక్షణ ఇవ్వడంతో పాటు మారుమూల గ్రామాల విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్యను, వసతులను అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో సైతం ఇలాంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వివేకానంద పాఠశాల విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలను నేర్పించడం అభినందనీయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సతీష్ గౌడ్, ఇన్చార్జీలు తిరుపతి, మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు. పట్టాల ప్రదానం అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థుల ప్రతిభా పాటవాలను చూసి అతిథులు ప్రశంసలు కురిపించారు. చదువు పట్ల ఆసక్తి పెంచేలా ఇలాంటి వేడుకలు నిర్వహించడంపై పాఠశాల యాజమాన్యాన్ని పలువురు అభినందించారు. ఈ వేడుక విద్యార్థుల జీవితంలో ఒక తీపి గుర్తుగా మిగిలిపోతుందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. మనోవికాసానికి తోడ్పడే ఇటువంటి కార్యక్రమాలు మున్ముందు కూడా కొనసాగించాలని వారు కోరారు.

